# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలోని మునిసిపల్ పాఠశాలలను ఆధునీకరించి నాణ్యమైన విద్య అందిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

**2.** **రాష్ట్రంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఒక్క రోజే 78 వేల 168 కేసులు పరిష్కారమయ్యాయి.**

**3.** **మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది.**

**4.** **జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి లక్షా 30 వేల780 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది.**

**5.** **ఈ నెల 10వ తేదీన జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం సందర్భంగా విద్యార్థి సమగ్ర ప్రగతి పత్రాలు ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.**

===========================

రాష్ట్రంలోని మునిసిపల్ పాఠశాలలను ఆధునీకరించి నాణ్యమైన విద్య అందిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో 20 కోట్ల రూపాయలతో ఆధునీకరించిన వి.ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన ఈ రోజు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన అందిస్తామన్నారు.

---------------------------

రాష్ట్రంలో నిన్న నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. ఒక్కరోజే 78 వేల 168 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం 63 కోట్ల రూపాయల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో 411 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో 135 కేసులు పరిష్కరించి 3 కోట్ల 85 లక్షల రూపాయల పరిహారం అందజేశారు.

---------------------------

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ రోజు నిర్వహించిన ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పశుగ్రాసాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ జంతుల

నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లను అందజేస్తోందని తెలిపారు. జంతుప్రేమికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆనందరావు సూచిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఇందులో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఐదు రోజుల పాటు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ జరగనుంది. కోరికల రొట్టెల కోసం దేశ, విదేశాల నుంచి భక్తులు చేరుకుంటున్నారు. స్వర్ణాల చెరువులో స్నానమాచరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేసింది.

---

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి లక్షా 30 వేల780 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. ప్రస్తుతం ఔట్ ఫ్లో 67 వేల 399 క్యూసెక్కులుగా ఉంది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35 వేల 315, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31 వేల 84 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 878.40 అడుగులకు చేరింది.

---

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ విద్యార్థి సమగ్ర ప్రగతి పత్రాలు.. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించనుంది. ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్యార్థులకు వీటిని విడివిడిగా రూపొందించింది. ఈ నెల 10వ తేదీన జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం సందర్భంగా వీటిని అందించనున్నారు. విద్యార్థులకు సంబంధించి ఆరోగ్యం, అకడమిక్, లక్ష్యాలు, నైపుణ్యాలను సమగ్రంగా ఇందులో పొందుపర్చనున్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

---

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బిందు సేద్యం చేపట్టే రైతుకు పూర్తి సబ్సిడీ అందిస్తోంది. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండల్లాలో ఈ పథకం మంచి ఫలితాలను ఇవ్వడంతో తూర్పు మండలాల్లోనూ రైతులు బిందు సేద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 4 వేల హెక్టార్లలో బిందు సేద్యం ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని తిరుపతి జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ప్రకాష్ తెలిపారు. 90 శాతం సబ్సిడీపై ఇస్తున్న డ్రిప్ పరికరాల కోసం రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆయన సూచిస్తూ..

వాయిస్ .. 30 సెకన్లు

---

ఈరోజు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భారతదేశ ఉప ప్రధానమంత్రిగా సేవలందించిన బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. కేంద్ర వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య రైల్వే శాఖల మంత్రిగా ఆయన పనిచేశారు. ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం సాగించారు. 1908 ఏప్రిల్ 5వ తేదీన జన్మించిన ఆయన... 1986 జులై 6వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---

ప్రముఖ జాతీయ వాది, విద్యావేత్త, భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఈరోజు. 1901 జులై 6వ తేదీన కోల్కతాలో జన్మించిన ఆయన స్వాతంత్ర్యానికి ముందు 1941–42లో బెంగాల్ ప్రావిన్సు మొదటి ఆర్థిక మంత్రిగా, స్వాతంత్ర్య అనంతరం కొంతకాలం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా సేవలందించారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు.

---------------------------

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ప్రసిద్ధ వైష్ణవ ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కాగా.. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇంగ్లండ్ జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా విజయానికి చేరువగా ఉంది. వరుసగా నాలుగో రోజూ ఆధిపత్యం చూపుతూ.. రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత్ రాణించింది. భారత్ రెండో ఇన్నింగ్స్ 6 వికెట్ల నష్టానికి 427 పరుగుల దగ్గర డిక్లేర్ చేసింది. దీంతో జట్టుకు మొత్తం 607 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం 608 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 72 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…27 సెకన్లు

=====================